క్లుప్తంగా

జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం రేపు

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఈ నెల మూడో తేదీన నిర్వహిస్తున్నట్టు సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావు సోమవారం తెలిపారు. ఆస్పత్రిలోని సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం దిశగా సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ హాజరవుతారన్నారు.

సేంద్రియ సాగుతో అధిక ఆదాయం

కంచిలి: సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకొని అధిక ఆదాయం సంపాదించవచ్చని ప్రకృతి వ్యవసాయ విధానం నార్త్ కోస్టల్ అధికారులు ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్‌టీవో హేమసుందర్‌రావు అన్నారు. బొగాబెణి గ్రామంలో సోమవారం పర్యటించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు.

14న హిందీ దినోత్సవం

పలాస: కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 14న హిందీ జాతీయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు హిందీ ఫోరం సభ్యులు కోరారు. ఈ మేరకు కాశీబుగ్గ పాఠశాలలో సోమవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఫోరం జిల్లా సభ్యులు సంతోష్, కిరణ్, భానుమూర్తి, సోమేశ్వరరావు, శ్రీనివాస్‌బాబ్జీ, విష్ణు, చిన్నారావు, సీతారాం, కల్పన, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

కంచిలి: బొగాబెణి పంచాయతీ పరిధి జెన్నాగాయి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త కొల్లి తాతాజీ అనారోగ్యం పాలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సోమవారం తాతాజీని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, స్థానిక సర్పంచ్ గణప సింహాచలం, నాయకులు లడ్డు కేశవపాత్రో, తలగాన తిరుపతిరావు ఉన్నారు.

విశ్వనాథం విగ్రహావిష్కరణ



విశ్వనాథం విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే శిరీష తదితరులు

పలాస: పలాసకు చెందిన తొలితరం వైద్యుడు, మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం విగ్రహాన్ని పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయగా.. ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సాయాన్ని అందజేస్తున్న గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: కేదారిపురం గ్రామానికి చెందిన దక్కువ పార్వతి ఇటీవల మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అసలే పేదరికం, ఆపై కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కేదారిపురం గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు స్పందించి రూ. 20 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు సోమవారం అందజేసి అండగా నిలిచారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యాన్ని ప్రదర్శనలో చిన్నారులు

ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన వెంకటేశ్వర డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలను చిన్నారులు కనువిందుగా ప్రదర్శించి అభినందించారు.

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు!

- ఏటా లక్షలాది రూపాయలు చెల్లింపులు



టెక్కలిలో అద్దె భవనంలో ఉన్న మైనింగ్ ఏడీ కార్యాలయం



వెంకటేశ్వర కాలనీలో కనీ..కనిపించని బోర్డుతో అద్దె భవనంలో ఉన్న బీసీ వెల్ఫేర్ కార్యాలయం



రోటరీనగర్‌లో అద్దె భవనంలో సబ్ ట్రెజరీ కార్యాలయం

టెక్కలి:

టెక్కలి డివిజన్ కేంద్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో ఏటా లక్షలాది రూపాయల నిధులు అద్దె రూపంలో ఆయా యజమానులకు చెల్లింపులు చేస్తున్నారు. అయితే అద్దె రూపంలో చెల్లిస్తున్న లక్షలాది రూపాయలతో ఆయా కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మాణం చేయవచ్చునని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలో అద్దె భవనంలో ఉన్నటువంటి ప్రభుత్వ కార్యాలయాలన్నింటిని పాత ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోకి తరలించాలనే ప్రతిపాదన కార్యరూపం దాల్చడం లేదు. దీంతో మారుమూల ప్రాంతాల్లో అద్దె ఇళ్లల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాల జాడ కోసం కొన్నిసార్లు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అంతే కాకుండా ఆయా కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఎంత సమయానికి వస్తున్నారో.. అసలు వస్తున్నారో.. రావడం లేదో తెలియని పరిస్థితి నెలకుంది. మరో వైపు కొన్ని కార్యాలయాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా పాలనా యంత్రాంగం స్పందించి అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వతమైన భవనాలు నిర్మాణాలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలు

డివిజన్ కేంద్రమైన టెక్కలిలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలిస్తే.. మైనింగ్ ఏడీ, సబ్‌ట్రెజరీ, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఐసీడీఎస్, బీసీ వెల్ఫేర్, ఉద్యానవన, కార్మిక శాఖ, హౌసింగ్ సహాయ ఇంజినీరింగ్, సహకార సొసైటీ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.

వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



వజ్రపుకొత్తూరు రూరల్: పలాస–కాశీబుగ్గల్లో మంగళవారం నిర్వహించనున్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు పలాసలోని ప్రగతి భవన్ వద్ద నుంచి బయలుదేరి కిడ్నీ ఆస్పత్రి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు సోమవారం తెలిపారు తెలిపారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. రైతుల పక్షాన నిలుస్తూ రైతు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వ్యవసాయాధికారులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు, రైతులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

కంచిలి: దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం సమన్వయకర్త పిరియా విజయ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం తొమ్మిది గంటలకు కవిటి టౌన్‌లో, పది గంటలకు ఇచ్ఛాపురం పట్టణం, మండలం నేతలతో కలిసి బస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అలాగే ఉదయం తొమ్మిది గంటలకు కంచిలి రైల్వేస్టేషన్ కూడలిలో, సోంపేట పట్టణంలోని బస్టాండు కూడలిలో రి వైఎస్సార్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పిస్తారు. ఈ కార్యక్రమాలకు పార్టీ క్యాడర్ అంతా హాజరు కావాలని కోరారు.

ఆలయ హుండీ ఆదాయం రూ. 42,462

కంచిలి: కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారికి హుండీలో భక్తులు వేసిన ఆదాయాన్ని సోమవారం సాయంత్రం లెక్కించారు. ఆగస్టు నెలకు సంబంధించి 42,462 రూపాయలు ఆదాయం సమకూరినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విజేతలకు బహుమతులందజేస్తున్న ఎంఈవో శివరాంప్రసాద్

కంచిలి: విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞాన సముపార్జనలో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. జలంత్రకోట పంచాయతీ పరిధి చొట్రాయిపురం గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా స్థానిక శ్రీకృష్ణ యాదవ యువత ఆధ్వర్యంలో మండలస్థాయి క్విజ్ పోటీలను సోమవారం నిర్వహించారు. 20 జట్లు పాల్గొనగా స్క్రీనింగ్ పరీక్షలో పది జట్లను ఎంపిక చేసి క్విజ్ పోటీ నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాలను సోంపేట మండలం మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, కంచిలి మండలం మఠం సరియాపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్ జట్లు గెలుపొందాయి.

ఎరువుల కొరతను తీర్చాలి



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పలాస: ఎరువుల కొరతను తక్షణమే తీర్చాలని రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బొడ్డపాడు గ్రామ సచివాలయం వద్ద సోమవారం పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బొడ్డపాడు గ్రామ రైతు సేవా కేంద్రానికి రావలసిన ఎరువుల కోటా యూరియా, డీఏపీ, పొటోష్ ఇంతవరకు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఎరువులను సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు, లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, రైతు నాయకులు పోతనపల్లి అప్పారావు, నెయ్యిల యుగంధర్, బోనెల హేమారావు పాల్గొన్నారు.

గంగమ్మ చెంతకు పార్వతీ తనయుడు



కవిటిలో గణపతి నిమజ్జనోత్సవ ర్యాలీ



కవిటి: డిగొనపపుట్టుగలో లడ్డూను దక్కించుకున్న సాయివల్లభ



సంతబొమ్మాళి: వినాయకుని లడ్డూతో రంజిత్‌రెడ్డి

కవిటి: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. సోమవారం గంగమ్మ చెంతకు పర్వతీ తనయుడు చేరారు. ట్రాక్టర్లు, వివిధ వాహనాల్లో విగ్రహాలను ఊరేగిస్తూ చెరువులు, సముద్రంలో నిమజ్జనం చేశారు. అలాగే వినాయక ప్రసాదం లడ్డూలను వేలం వేయగా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డిగొనపపుట్టుగలో సిద్ధి వినాయక లడ్డూను కరగాన సాయివల్లభ, లయ దంపతులు 1,00,201 రూపాయలకు కైవసం చేసుకున్నారు. ఈ లడ్డూతో పాటు వారికి 15 కిలోల వెండిని బహూకరించారు. అలాగే చిన్నలడ్డూను బెందాళం భువన్‌చంద్ర సోనియా దంపతులు రూ.75,500 దక్కించుకున్నారు.

సంతబొమ్మాళి: హెచ్.ఎన్.పేట పంచాయతీ కేశినాయుడుపేటలో వరసిద్ధి వినాయక లడ్డూను వేలం వేయగా 73,333 రూపాయలక జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి కుమారుడు రంజిత్ రెడ్డి కైవసం చేసుకున్నాడు. అనంతరం వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.స్థానిక సర్పంచ్ పాల మహాలక్ష్మి, మహేశ్వరరెడ్డి ఉన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సత్కారం

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు మత్స్యకార గ్రామం ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి యర్ర ప్రభాస్ నీట్ పరీక్షలో ర్యాంకు సాధించారు. దీంతో అతన్ని ఉపాధ్యాయులు సోమవారం దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ప్రధానోపాధ్యాయురాలు జి.హేమకుమారి మాట్లాడుతూ.. పేద మత్స్యకార కుటుంబానికి చెందిన ప్రభాస్ మున్ముందు మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కొంత నగదును అందజేశారు.



ప్రభాస్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు